క్లుప్తంగా

పక్కాగా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు


హనుమంతవాక కూడలి వద్ద ట్రాఫిక్ నియంత్రణలో సీఐలు

ఆరిలోవ: జాతీయ రహదారి, బీఆర్‌టీఎస్, ప్రధాన రహదారులపై ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా సోమవారం జాతీయ రహదారిపై హనుమంతవాక కూడలి వద్ద ఆరిలోవ లా అండ్ ఆర్డర్ సీఐ సోమశేఖర్, ట్రాఫిక్ సీఐ ప్రసాద్, ఎస్‌ఐలు కుమార్, రుక్మంగధరావు, కానిస్టేబుళ్లు స్వయంగా ట్రాఫిక్‌ను నియంత్రించారు. ఈ కూడలిలో వాహన చోదకులు ఇబ్బందిపడకుండా తగిన చర్యలు చేపట్టారు. వెంటవెంటనే వాహనాలను వాటి మార్గాలలో వెళ్లే ఏర్పాట్లు చేశారు. అలాగే నాని యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హెల్మెట్ ధారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కూడలిలో బేనర్ పట్టుకుని ఫౌండేషన్ సభ్యులు, ట్రాఫిక్ పోలీసులు వాహనచోదకులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ వాడకం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు.

స్వర్ణ గర్జనకు ఆహ్వానం


వీసీ ప్రసాదరెడ్డికి వివరిస్తున్న కర్రి వేణుమాధవ్

బీచ్ రోడ్డు: విశాఖలో వచ్చేనెల 19న జరగనున్న థ్యాంక్యూ పీఎం మోదీజీ స్వర్ణ గర్జన కార్యక్రమానికి ఏయూ వీసీ ప్రసాదరెడ్డికి స్వర్ణకార సంఘం అధ్యక్షుడు కర్రి వేణుమాధవ్ ఆహ్వానం పలికారు. ఈ మేరకు సోమవారం వీసీని కలిసి కార్యక్రమం వివరాలను వివరించారు. మోదీ ముద్ర కిషోర్ యోజన ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 152 సంఘాలకు లక్ష 72 వేళ కుటుంబాలు అభివృద్ధి చెందాయని ఆయన తెలిపారు. రాష్ట్రంలోని 26 జిల్లాల స్వర్ణకార సంఘాల అధ్యక్షులు ప్రమాణ స్వీకారం కూడా ఉంటుందన్నారు.

దయాల్‌బాగ్‌లో ఫుట్‌వేర్ ప్రదర్శన


ఫుట్‌వేర్ ప్రదర్శనలో వినియోగదారుల రద్దీ

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్‌లో దయాల్‌బాగ్ ఇన్‌స్టిట్యూట్‌లో సోమవారం చెప్పుల(ఫుట్‌వేర్) ప్రదర్శన, విక్రయాలు నిర్వహించారు. స్త్రీ, పురుషులకు సంబంధించిన చెప్పులు, షూలు, విక్రయించారు. విశాలాక్షినగర్, సాగర్‌నగర్, ఎంవీపీ కాలనీ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన వినియోగదారులతో ఈ ప్రదర్శన కళకళలాడింది. సుమారు రూ.1.50 లక్షలు విలువ చేసే వస్తువులు విక్రయించినట్టు ప్రదర్శన కమిటీ చైర్మన్ కె.ఎస్.ప్రకాష్‌రావు, దయాల్‌బాగ్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధి దక్షిణమూర్తి తెలిపారు.

వచ్చేనెల 14న విద్యార్థులకు పురస్కారాలు

ఎంవీపీ కాలనీ: కళావేదిక సంస్థ ఆధ్వర్యంలో నవంబర్ 14న చిల్డ్రన్స్ డే వేడుకలను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, పురస్కారాలు అందించనున్నట్టు కళావేదిక కార్యదర్శి నండూరి రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ అంశాల్లో నిష్ణాతులైన 6వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు గల విద్యార్థులు 15వ తేదీలోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. 99635 90368, 85228 99458 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

గాంధీజీ మార్గం ఆచరణీయం


13వ వార్డులో గాంధీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ సునీత

- ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి
- ఘనంగా మహాత్ముని జయంతి వేడుకలు


ఏయూలో మహాత్ముని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి, తదితరులు

ఎంవీపీ కాలనీ: గాంధీ మార్గాన్ని నేటి యువత ఆచరణలో చూపాలని ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి సూచించారు. గాంధీజీ జయంతి సందర్భంగా ఏయూలోని గాంధీయన్ స్టడీస్ సెంటర్ ఆధ్వర్యంలో »ఎమర్జింగ్ గ్లోబల్ ఆర్డర్, రిలవెన్స్ ఆఫ్ గాంధీయన్ థాట్స్«అనే అంశంపై సోమవారం సదస్సు నిర్వహించారు. తొలుత వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి.. మహాత్ముని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గాంధీ సిద్ధాంతాలు, అహింసా మార్గం కేవలం మాటలకే పరిమితం అవుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో యువత ఆయన సిద్ధాంతాలను, ఆలోచనలను ఆచరణలో పెట్టే దిశగా కృషి చేయాలన్నారు. వీఐటీ ఏపీ స్కూల్ ఆఫ్ లా డీన్ ఆచార్య బెనర్జీ చుక్కా మాట్లాడుతూ గాంధీ ఆలోచనలు, మార్గాలు నిత్యం దేశ ఐక్యతను, దేశ అభ్యున్నతిని కాంక్షిస్తాయన్నారు. ఈ సందర్భంగా గాంధీ సిద్ధాంతాలపై రాసిన పుస్తకాలను వీసీ ఆవిష్కరించారు. అనంతరం గాంధీయన్ స్టడీస్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన గాంధీ చిత్రపటాలతో కూడిన ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఈ కార్యక్రమంలో సెంటర్ డైరెక్టర్ ఆచార్య సీతామాణిక్యం, ఆచార్య చల్లా రామకృష్ణ, పలువురు ఆచార్యులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో గాంధీ జయంతి సోమవారం ఘనంగా జరిగింది. జీవీఎంసీ 10వ వార్డు రవీంద్రనగర్‌లో గాంధీ చిత్ర పటానికి మాజీ కార్పొరేటర్ జగ్గుపల్లి అప్పలరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు కె.ఎస్.చలం, ఒమ్మి శ్రీను, చింత శ్రీను, బీజపు, పైడిరాజు, ఆనంద్, కృష్ణ, రజని, స్రవంతి, శారదా, జయశ్రీ, తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు.

◆ జీవీఎంసీ 12వ వార్డులో కార్పొరేటర్ అక్కరమాని రోహిణి స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి మహాత్ముని చిత్ర పటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సత్తి మందారెడ్డి, కన్నేటి సుబ్బారెడ్డి, ముద్దాడ పాపారావు, మోహన్, హుస్సేన్, అర్జున్, సూర్యారావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

◆ జీవీఎంసీ 13వ వార్డులో కార్పొరేటర్ కెల్ల సునీత, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కెల్ల సత్యనారాయణ, పోలరావు, వెంకటరెడ్డి, శ్రీను, కొండమ్మ, భాగ్యరాజ్, పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 18వ వార్డు సెక్టార్-6లోని భద్రం పార్కు అసోసియేషన్ ఆధ్వర్యంలో పార్కులోని గాంధీ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పుక్కళ్ల ధనలక్ష్మి, శంకర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు ఎల్లాజీ, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

◆ ఎంవీపీ కాలనీ సెక్టార్-7లో స్థానిక శాఖా గ్రంథాలయంలో మహాత్ముడి చిత్రపటానికి గ్రంథాలయ అధికారి ఉమామహేశ్వరరావు, పలువురు పాఠకులు పూల మాలలు వేసి అంజలి ఘటించారు.

◆ లాసన్స్ బే కాలనీలోని హిడెన్ స్ప్రౌట్స్ మానసిక వికలాంగుల పాఠశాలలో గాంధీ చిత్ర పటం వద్ద నిర్వాహకుడు కండిపల్లి శ్రీనివాస్, తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు.

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గాంధీజి చిత్ర పటానికి డీఐజీ ఎస్.హరికృష్ణ, ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, అధ్యాపకులు పాల్గొన్నారు.

బీచ్ రోడ్డు: చినవాల్తేరు రెల్లివీధిలోని అంబేడ్కర్ సెంటర్ వద్ద మహాత్ముని చిత్ర పటానికి వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకుడు బంగారి పృధ్వీరాజ్, తదితరులు పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు అశోక్, ధర్మా, వెంకటరావు, ప్రసాద్ పాల్గొన్నారు. పెదవాల్తేరు గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో బాపూజీకి నివాళులర్పించారు.


జీవీఎంసీ 12వ వార్డులో గాంధీజీ చిత్ర పటానికి అంజలి ఘటిస్తున్న కార్పొరేటర్ రోహిణి


మహాత్ముడికి నివాళులర్పిస్తున్న భద్రం పార్కు అసోసియేషన్ సభ్యులు


హిడెన్‌స్ప్రౌట్స్‌లో బాపూజీకి నివాళులర్పిస్తున్న మానసిక వికలాంగ విద్యార్థులు


కృష్ణా కళాశాలలో గాంధీజీ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న డీఐజీ హరికృష్ణ, ప్రిన్సిపాల్ విజయబాబు, అధ్యాపకులు


సర్వధర్మ ప్రార్థనలు



సర్వధర్మ ప్రార్థనలతో ర్యాలీ నిర్వహిస్తున్న తోటగరువు హైస్కూల్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు

ఆరిలోవ: గాంధీ జయంతి సందర్భంగా తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు సర్వధర్మ ప్రార్థనలు చేశారు. ఎన్‌సీసీ విభాగ టీచర్ ఎ.స్వామినాయుడు ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో ప్రార్థనలు జరిపి, అనంతరం ర్యాలీ చేపట్టారు. మతాల మధ్య శాంతి, సహకారం అవసరమని తెలియజేస్తూ విద్యార్థులు తోటగరువు నుంచి పెదగదిలి కూడలి వరకు సాగిన ఈ ర్యాలీని స్థానికులు ఆసక్తిగా తిలకించారు. విద్యార్థులు సర్వధర్మంపై అవగాహన కల్పించారు.

ఖాదీకి ప్రోత్సాహమే మహాత్ముడి ఆకాంక్ష


సంతలో ఉత్పత్తులను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

ఎంవీపీ కాలనీ: ఖాదీ ఉత్పత్తులకు ప్రోత్సాహం కల్పించాలని మహాత్మగాంధీ ఆకాంక్షించేవారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ అన్నారు. మహాత్మగాంధీ, లాల్‌బహుదూర్ శాస్త్రీల జయంతి సందర్భంగా బీజేపీ నగర కార్యాలయం ఆవరణలో సోమవారం ఖాదీ సంత ఏర్పాటు చేశారు. తొలుత గాంధీ, శాస్త్రీ చిత్ర పటాల వద్ద పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖాదీని ప్రోత్సహించే దిశగా మహాత్ముడు ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారన్నారు. ఈ సంతలో ఖాదీ ఉత్పత్తి సంఘాలు 28 స్టాళ్లు ఏర్పాటు చేశాయి. ఈ కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి, బీజేపీ నగర అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, రాష్ట్ర కోశాధికారి నాగేంద్ర, రాష్ట్ర కార్యదర్శి సురేంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఏయూ విద్యార్థిని మౌనికకు గోల్డ్ మెడల్


సాయిరాగ మౌనిక

ఆరిలోవ: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో 2021-23 సంవత్సరంలో నగరానికి చెందిన తూము సాయిరాగ మౌనిక ఎమ్మెస్సీ సైకాలజీలో బంగారు పతకం సాధించారు. ఇటీవల విడుదలైన ఫలితాలలో ఆమె సైకాలజీ విభాగంలో మొదటి ర్యాంక్ సాధించినట్టు విభాగాధిపతి ఎం.వి.ఆర్.రాజు తెలిపారు. ఏయూలో ఈ ఏడాది డిసెంబరులో జరగనున్న స్నాతకోత్సవంలో ఆమెకు గోల్డ్ మెడల్ బహూకరించనున్నట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మౌనికను అధ్యాపకులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

ఇసుకతోటలో నేడు జగనన్న సురక్ష వైద్య శిబిరం

- స్పెషలిస్టు వైద్యులతో పరీక్షలు
- హాజరుకానున్న మంత్రి విడదల రజని


ఇసుకతోటలోని యూపీహెచ్‌సీ

మద్దిలపాలెం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం మంగళవారం 16వ వార్డు ఇసుకతోట యూపీహెచ్‌సీలో జరగనుంది. ఈ శిబిరాన్ని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని ప్రారంభించనున్నారు. దీంతో డీఎం హెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు హెల్త్ సెంటర్ వద్ద వైద్య శిబిరానికి కావాల్సిన ఏర్పాట్లు చేయిస్తున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాటు చేస్తున్నారు. రోగుల సౌకర్యార్థం కుర్చీలు ఏర్పాటు చేయనున్నారు. రోగుల పేర్ల నమోదు, వైద్య తనిఖీలు, పరీక్షలు చేయడానికి వీలుగా వేర్వేరుగా కౌంటర్లను ఏర్పాటు చేయనున్నారు. ప్రత్యేక కౌంటర్ ద్వారా మంచినీటిని అందుబాటులో పెడుతున్నారు. ఇప్పటికే ఇసుకతోట అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఏడు సచివాలయాల్లో ముందుగా విస్తృత ప్రచారం చేశారు. తర్వాత ఏఎన్‌ఎం, ఆశాలు, ఇతర వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పరీక్షలు చేశారు. వారిలో ఈ శిబిరానికి రావాల్సిన వారికి ముందస్తుగా టోకెన్లు జారీ చేశారు. ప్రధానంగా దీర్ఘకాలిన వ్యాధులు ఉన్నవారికి వైద్య శిబిరాలకు రిఫర్ చేశారు.

5న మెగా రక్తదాన శిబిరం

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 5న మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నామని కళాశాల ప్రిన్సిపాల్ సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. 13ఏ బెటాలియన్ ఎన్‌సీసీ విద్యార్థులు ఈ శిబిరంలో రక్తదానం చేయనున్నారని పేర్కొన్నారు. కళాశాల ఎన్‌సీసీ లెఫ్టినెంట్ అధికారి బి.సన్యాసినాయుడు పర్యవేక్షణలో ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు.

నగరానికి చేరుకున్న కశ్మీర్ యువత


గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జీవీఎల్

బీచ్ రోడ్డు: కశ్మీర్ యువ సమ్మేళనంలో పాల్గొనే కశ్మీర్ యువకులు సోమవారం నగరానికి చేరుకున్నారు. బీచ్ రోడ్డులోని యూత్ హాస్టల్ల వద్ద వారికి రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాల కోసం యువతకు వివరించారు. అనంతరం గాంధీ జయంతి సందర్భంగా మహాత్ముడి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మంగళవారం ఉదయం 10 గంటలకు సిరిపురంలోని వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో ఈ సమ్మేళనం ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నెహ్రూ యువ కేంద్రం డైరెక్టర్ విజయారావు, జిల్లా అధికారి మహేశ్వరరావు, ఏపీసీ రామ్‌ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆటో చోరీ

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆటో చోరీకి గురైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. అప్పన్న అనే ఆటో డ్రైవరు తన ఆటోను జ్ఞానాపురం జేఎన్‌ఎన్‌యుఆర్‌ఎం కాలనీ వద్ద రోడ్డు మీద పెట్టి సమీపంలోని టిఫిన్ దుకాణం వద్దకు వెళ్లాడు. తిరిగి వచ్చి చూసేసరికి ఆటో అక్కడ లేకపోవడంతో సమీపంలో అన్ని ప్రాంతాల్లో వెతికాడు. తన ఆటో కనిపించకపోవడంతో కంచరపాలెం క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అందరి సహకారంతో కాలుష్య నియంత్రణ


ఆటోలో జీవీఎంసీ గాంధీ పార్కు వద్దకు చేరుకున్న మేయర్ హరివెంకటకుమారి


విద్యుత్ వాహనంపై చేరుకున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

దాబాగార్డెన్స్: కాలుష్య నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పిలుపునిచ్చారు. నగర కాలుష్య నియంత్రణలో భాగంగా సోమవారం మేయర్ తన క్యాంపు కార్యాలయం నుంచి ప్రజా రవాణా ఆటోలో ప్రయాణించగా, జీవీఎంసీ కమిషనర్ విద్యుత్ వాహనంపై ప్రయాణించి జీవీఎంసీ సెంట్రల్ పార్క్ వద్ద గల మహాత్మా గాంధీ విగ్రహం వద్దకు చేరుకుని.. జాతిపిత, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలుష్య రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని కోరారు. నగరంలో శబ్ద, వాయు కాలుష్యం విపరీతంగా పెరుగుతున్న దృష్ట్యా నగర ప్రజలు సాధ్యమైనంత వరకు ప్రజా రవాణా, కాలుష్య రహిత వాహనాలు వినియోగించాలని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.

రేపటి నుంచి జిల్లాలో శౌర్య జాగరణ యాత్ర

సీతమ్మధార: యువతలో దేశభక్తి విలువలు పెంపొందించేలా దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న శౌర్య జాగరణ యాత్ర జిల్లాలో ఈ నెల 4 నుంచి 10 వరకు జరుగుతుందని విశ్వహిందూ పరిషత్ విశాఖ నగర ఉపాధ్యక్షుడు నారాయణరావు తెలిపారు. గురుద్వారా దరి ఒక హోటల్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ యాత్ర దేశవ్యాప్తంగా ఐదు లక్షల గ్రామాల్లో చేపడుతున్నారన్నారు. విశ్వహిందూ పరిషత్ ఆవిర్భవించి 60 ఏళ్లు కావస్తున్నా సందర్భంగా యాత్ర కొనసాగుతుందని చెప్పారు. దేశభక్తుల త్యాగాలను నేటి తరానికి తెలియజేయడమే యాత్ర ఉద్దేశమని పేర్కొన్నారు. తగరపువలస, ఆనందపురం, భీమిలి, సింహాచలం, విశాఖ సిటీ, గాజువాక, స్టీల్‌ప్లాంట్, అనకాపల్లిలో యాత్ర జరుగుతుందని వివరించారు. సమావేశంలో నగర కార్యదర్శి అప్పలరాజు, రాష్ట్ర మఠ్ మందిర్ టోలిపుడి పెద్దిశర్మ, టి.పి.వెంకటేశ్వర్లు, బీజేపీ ధార్మిక సెల్ రాష్ట్ర కో-కన్వీనర్ విజయఫణి, రవీంద్ర పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

దాబాగార్డెన్స్: విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వ హించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు.

కల్యాణం.. కమనీయం


తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ బేడామండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు సాతులూరి నంసింహాచార్యులు, ఆత్మకూరి రవి తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

'చెక్క'చెదరని కళాఖండాలు


ఖైదీలు తయారు చేసిన వివిధ కళాకృతులు

- కారాగారంలో ఖైదీల అద్భుతాలు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో ఖైదీలు తమ చేతికి పని పెడుతున్నారు. వారి నైపుణ్యంతో నిర్జీవమైన చెక్కపై జీవం పోస్తున్నారు. ఇక్కడ శిక్ష పడిన ఖైదీలతో పాటు రిమాండ్ ఖైదీలు వందలాది మంది ఉన్నారు. వారు చేసే పనిని బట్టి ఇక్కడ అధికారులు వారికి పని అప్పగిస్తున్నారు. ఖైదీల్లో చెక్క పనిచేసేవారు, శిల్పులు, దర్జీలు, వ్యవసాయం చేసేవారు ఉన్నారు. ఇక్కడ కర్రను శిల్పాలుగా మార్చే శిల్పులు కూడా ఉన్నారు. వారు తమ చేతికి పని చెప్పి చెక్కకు జీవం పోస్తున్నారు. ఖైదీలు ఇటీవల వివిధ బొమ్మలు తయారు చేశారు. ఓ ఖైదీ చెక్కతో జాతీయ చిహ్నం(నాలుగు సింహాలు)ను తయారు చేసి ఔరా అనిపించాడు. నాలుగు అడుగుల పొడవు గల ఆ చెక్క కళాఖండాన్ని జైలు అధికారులు పర్యవేక్షణాధికారి చాంబర్‌లో అమర్చారు. దీంతో పాటు మరికొందరు ఖైదీలు చెక్కతో నెమలి, చేప, డాల్ఫిన్, ఇంట్లో టేబుళ్లపై అలంకరణ బొమ్మలు తయారు చేశారు. వీటి తయారీకి ఉపయోగంలో లేని చెక్కలనే ఖైదీలు వినియోగించడం గమనార్హం. వీటిని పర్యవేక్షణాధికారి చాంబర్ ఆవరణలో ఉంచడంతో జైల్‌ను సందర్శించే ఉన్నతాధికారులు, అతిథులను కనువిందు చేస్తున్నాయి. ఖైదీల నైపుణ్యాన్ని అంతా ప్రశంసిస్తున్నారు.


ఓ ఖైదీ చెక్కతో తయారు చేసిన జాతీయ చిహ్నం


నాలుగు సింహాల బొమ్మ


ఖైదీలు తయారు చేసిన బొమ్మలు

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్

10 కిలోల గంజాయి, 3 సెల్‌ఫోన్లు, రెండు స్కూటీల స్వాధీనం

సీతమ్మధార: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముగ్గురు యువకులను ఫోర్త్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారు తెలిపిన వివరాలిలా.. అల్లూరి సీతారామరాజు జిల్లా, పెడబయలు మండలం, బండపల్లి గ్రామానికి చెందిన జంపరంగి శంకరరావు, శ్రీమంజునాథ, అనకాపల్లి జిల్లా కొత్తకోటకు చెందిన కె.గణేష్ కలిసి నగరానికి గంజాయి తరలిస్తున్నారు. కైలాసపురం రోడ్డులో అనుమానస్పదంగా వారు కనిపించడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా.. గంజాయి ఉన్నట్లు తేలింది. ముగ్గురిని అరెస్ట్ చేసి 10 కిలోల గంజాయితోపాటు మూడు సెల్‌ఫోన్లు, రెండు స్కూటీలు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ వెంకటరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేర నియంత్రణలో భాగస్వాములు కండి


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ సాయి

మర్రిపాలెం: నేరాల నియంత్రణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కంచరపాలెం ఐదో పట్టణ సీఐ ఎన్.సాయి పిలుపునిచ్చారు. కైలాసపురం, కస్తూరినగర్ తదితర ప్రాంతాల్లో నేర నియంత్రణపై సోమవారం రాత్రి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి స్థానికులకు అవగాహన కల్పించారు.ఆయా ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్ వాసులతోపాటు స్థానికులు సంఘాలుగా ఏర్పడి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తద్వారా నేరాలకు పాల్పడే వారిని త్వరితగతిన గుర్తించి నియంత్రించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రవికిషోర్, పెద్ద ఎత్తున స్థానికులు పాల్గొన్నారు.